క్లుప్తంగా

జోరుగా ఉల్లి నాట్లు



ఆర్ఎస్ రంగాపురంలో ఉల్లి నాట్లు వేస్తున్న కూలీలు

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాలలో బోరుబావుల కింద ఉల్లి నాట్లు జోరుగా వేస్తున్నారు. ఆర్ఎస్ రంగాపురం, యంబాయి, సీతారామాపురం, బైనపల్లె, శంకలాపురం, ముద్దవరం, రుద్రవరం గ్రామాల్లో ఉల్లి ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఉల్లికి మార్కెట్లో మంచి ధర లేకున్నప్పటికీ రైతులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కలిసొస్తే కష్టాల నుంచి గట్టెక్కుతామనే భరోసాతో రైతులు ఉల్లిసాగుకే మక్కువ చూపుతున్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులను అందజేస్తున్న బీఎండబ్ల్యూ కమిటీ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన మహబూబ్ ఇటీవలే అగ్ని ప్రమాదానికి గురై 60 శాతం శరీర భాగాలు కాలిపోయాయి. బీఎండబ్ల్యూ (బేతంచెర్ల మైనార్టీ వెల్ఫేర్ అసోయేషన్) కమిటీ సభ్యులు బాధితుని ఆదివారం పరామర్శించి నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో బీఎండబ్ల్యూ కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌వలి, ఉపాధ్యక్షుడు షేక్షా, సభ్యులు వలీ, జుబేర్, హిమాయత్, సమోసావలి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



గోపురం పనులు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై వెలసిన లక్ష్మి నరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కూలీలు, మెటీరియల్ సమస్యతో దాదాపు నెల నుంచి పనులకు అంతరాయం ఏర్పడింది. రామ్‌కో సిమెంట్ కంపెనీ రూ.7కోట్లతో ఆలయాభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఆలయ గర్భగుడి పనులు పూర్తి చేశారు. ఐదు అంతస్తుల గాలి గోపురం, మెట్ల మార్గం పనుల్లో జాప్యం జరుగుతుంది. పనులన్నీ పూర్తయింటే ఈఏడాది మేలో స్వామి బ్రహ్మోత్సవాలు జరగాల్సి ఉండేది. ఇప్పటికే ఉత్సవాలు జరగక ఐదేళ్లు అవుతుంది. ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో జాప్యం చోటు చేసుకోవడం,స్వామి కల్యాణ బ్రహోత్సవాలకు బ్రేక్ పడుతుండటంతో భక్తుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చిత్తరంజన్ దాస్ సేవలు చిరస్మరణీయం



చిత్తరంజన్‌దాస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : స్వాతంత్య్ర సమర యోధుడు చిత్తరంజన్‌దాస్ సేవలు చిరస్మరణీయం అని సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ అన్నారు. చిత్తరంజన్‌దాస్ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం తారకరామనగర్‌లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చిత్తరంజన్‌దాస్ త్యాగాలను మహ్మద్ రఫీ గుర్తు చేశారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్ : పట్టణానికి చెందిన గార్లపాటి లక్ష్మణస్వామి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు రాఘవేంద్ర, సంధ్య దంపతులు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. దాతలతో కలిసి ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ రోగులు, గర్భిణులు, బాలింతలకు గ్రుడ్డు, రొట్టె,పప్పు అందజేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు లాస్య ప్రియ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి సాగు.. లాభాలు బాగు!

- సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు
- అంతర సేద్యం లాభదాయకం
- లోదుక్కులతో నేలకోత దూరం



డోన్ రూరల్ : పండ్లలో మామిడి రారాజు. పండితే కాసుల పంట....లేదంటే నష్టాల మూట. ఈ సీజన్‌లో మామిడితోటల్లో కోతలు దాదాపు పూర్తయినట్లే. ప్రస్తుతం అక్కడక్కడ కోశారు. అయితే మామిడి దిగుబడులు ఊహించనంత లేవు. నాణ్యత సైతం అంతంత మాత్రమే ఉందంటున్నారు వ్యాపారులు. డోన్ మండల పరిధిలోని కొత్తకోట, గుమ్మకొండ, దేవరబండ, ఓబులాపురం, ఎద్దుపెంట, యాపదిన్నె గ్రామాలలో మామిడి సాగు చేస్తారు. అదేవిధంగా ప్యాపిలి మండల పరిధిలోని హుసేనాపురం, పీఆర్ పల్లె, ప్యాపిలి, చిన్నపూజర్ల, గార్లదిన్నె గ్రామాల్లోనూ మామిడిని సాగు చేస్తారు రైతులు. ఈయేడు పండ్ల దిగుబడులు ఆశించినంతగా లేదంటున్నారు రైతులు, వ్యాపారులు. ఈ నేపథ్యంలో మెలకువలు పాటిస్తే మామిడి సాగులో లాభాలు బాగుంటాయి అంటున్నారు ఉద్యానశాఖ అధికారి కళ్యాణి. లోతైనా దుక్కులతో నేల కోతను అరికట్టవచ్చన్నారు. అంతర సేద్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన కాయల నాణ్యతతోపాటు దిగుబడులు బాగుంటాయన్నారు. తోటల్లో చెట్టుకు మధ్యలో లోతుగా దుక్కులు చేసుకోవాలి. అలా చేస్తే నేల స్వభావం గుల్లబారి పూర్తిగా మారిపోతుంది. జూలై ఆఖరు, ఆగస్టులో రెండోసారి, అక్టోబర్, నవంబర్ నెలల్లో మూడోసారి దక్కులు చేసుకోవాలి. మొదటి దుక్కులో లోతుగా దున్నడంతో నీరు భూమిలోకి ఇంకి నేలకోత అరికడుతుంది. దీంతో భూమిలోకి గాలి బాగా ప్రసరించి చెట్లు ఆరోగ్యంగా ఉంటాయి. అంతర్ సేద్యంతో కలుపు నివారించవచ్చు. నేలలోని కీటకాలు, పురుగులు చనిపోతాయి. వేరు కుళ్లు ఎక్కువగా ఆశించదు. దీంతో దిగుబడులు బాగుంటాయి.

మొక్కలు నాటే ప్రక్రియా ఇలా

అధిక శాతం తోటల్లో సరైన పద్ధతులు పాటించక రైతులు నష్టపోతున్నారు. సక్రమైన యాజమాన్య పద్ధతులు పాటించక చెట్లు చనిపోతున్నాయి. దీంతో తోటల్లో అధిక శాతం ఖాళీ భూమి కనిపిస్తుంది. ఈ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేటప్పుడు ఒక మీటరు పొడవు, అర మీటరు వెడల్పు, అర మీటరులోతు గుంత తవ్వాలి. గుంతలోపై అరమీటరు మట్టిని ఓవైపు, మరో అర మీటరు మట్టిని మరోవైపు, ఆ తర్వాత తీసే మట్టిని మరోవైపు వేయాలి. అనంతరం అరమీటరు మట్టితోపాటు పశువుల ఎరువు, సూపర్ పాస్ఫేట్‌తో కలిపి వేయాలి.

ఎరువులు వాడకం, యాజమాన్య పద్ధతులు

ఎరువులు ముఖ్యంగా నత్రజని, భాస్వరం పొటాష్ పోషకాలను సకాలంలో అందించాలి. మోతాదు మేరకు వాడాల్సి ఉంటుంది. ఏడాది పైబడిన చెట్లకు పేడ ఎరువు, వర్మికంపోస్టు 10కిలోలు, పదేళ్లపైబడిన చెట్లకు 30నుంచి40 కిలోల పేడ ఎరువు, 2కిలోల వేపచెక్క, కిలో ట్రైకోడెర్మావిరిడి కల్చర్ వేయాలి. అమ్మోనియం సల్ఫేట్ 500గ్రాములు, సూపర్ పాస్ఫేట్ 750 గ్రాములు, పొటాష్ 50గ్రాములువేయాలి. 20రోజుల తరువాత తేలికపాటి తడి ఇవ్వాలి. మెగ్నీషియం సల్ఫేట్100–120గ్రాములు, ఐరన్ సల్ఫేట్ 100–120 గ్రాములు, జింక్ సల్ఫేట్ 100–120గ్రాములు, బోరాక్స్ 80గ్రాములు, క్యాల్షియం సల్ఫేట్ 100–120 గ్రాములు వేయాలి. జూలై, ఆగస్టు నెలల్లో పాదుల్లో చల్లుకొని నేల కలిచేలా చేయాలి.



మామిడితోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి (ఫైల్)

మొదల్లో చెదల నివారణకు

చెదల నివారణకు 100గ్రాములు మిలాథిన్, 50గ్రాములు ఎండోసల్ఫాన్ పొడిమందు, పశువుల ఎరువును బాగా కలపాలి. ఈ ఎరువు కలిపిన మిశ్రమంతో పూడ్చాలి. తక్కువ వస్తే పక్కనున్న మట్టితో పూడ్చాలి. మొక్కను నాటే ముందు రోజూ గుంతకు నీరు నింపితే కుదిపడి గుంత ఏర్పడుతుంది. ఆ గుంతలో చెట్టుకున్న ప్లాస్టిక్ కవరు తొలగించి ముద్ద ఎంతమాత్రం ఉంటే అంతవరకు మాత్రం గుంత తీసి పూడ్చాలి. నాటిన అంటుభాగం భూమిలో లేకుండా చూడాలి. చెట్టు కదలకుండా కర్ర పాతి కట్టాలి. చెట్టు మొదళ్లకు క్లోరోపైరిపాస్ 2.50 ఎం, ఎల్ లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. పెద్ద చెట్లకు కిలో మైలతుత్తం, కిలో సున్నం, పుట్టమన్ను, 5లీటర్ల నీటిలో కలిపి చెట్టు మొదల నుంచి 3అడుగుల ఎత్తు వరకు పూయాలి.

చెట్టు భూమికి మీటరు ఎత్తులో ఉండాలి

చెట్టు భూమిపై నుంచి మీటరు ఎత్తు వరకు కొమ్మలు కత్తిరింపు చేయాలి. ఉత్తర, దక్షిణ వైపు చెట్టుకు గల కొమ్మలు కింద భాగాన లేకుండా కత్తిరించాలి. గాలి వెలుతురు తగిలేలా గుబురు కొమ్మలు లేకుండా చూడాలి. సూర్యరస్మి తగలక పోతే చీడపీడలలు వస్తాయి.

నేడు బక్రీద్ ప్రత్యేక ప్రార్థనా వేళలు

ప్యాపిలి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. పట్టణంలోని కొత్త ఈద్గాలో సోమవారం ఉదయం 8 గంటలకు సామూహిక ప్రార్థనలు ప్రారంభం అవుతాయని ప్రభుత్వ సర్ ఖాజీ మహబూబ్ ఖాన్ తెలిపారు. 7–30 గంటలకు మహబూబ్ సుభాని కట్ట నుంచి సామూహికంగా తక్బీర్ పఠిస్తూ ఈద్గాకు చేరుకోవాలని సూచించారు. అలాగే మండల పరిధిలోని జలదుర్గం ఈద్గాలో ఉదయం 8–30 గంటలకు ఈద్ ప్రార్థనలు ప్రారంభం అవుతాయన్నారు. చిన్నపొదిళ్ల ఈద్గాలో ఉదయం 9 గంటలకు ఈద్ నమాజ్ ప్రారంభం అవుతుందని వివరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నాగభూషణంరెడ్డి(43) నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. నాగభూషణంరెడ్డికి కొన్నేళ్లుగా కడపు నొప్పితో ఇబ్బందులుపడుతున్నారు. పలువురు వైద్యుల వద్ద చూపించినా నయం కాకపోవడంతో మనస్థాపం చెంది శనివారం ఇళ్ల ముందు కళ్లాపు చల్లు మందు తాగి ఆత్మాహత్యకు పాల్పాడాడు. బంధువులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తలించారు. మృతురాలు భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కోవెలకుంట్ల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు మౌలాలి, ప్రధాన కార్యదర్శి అజాంబేగ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, మాజీ ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, నెలవారీ పదోన్నతులు చేపట్టాలని, 117 జీఓ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, జీవీ సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, ఎంవీ సుబ్బారెడ్డి, నాగేశ్వరయ్య, ఇమ్రాన్, ఆదిశేష గిరిరావు, మనోహర్, రవీంద్రారెడ్డి, నాగేశ్వరనాయక్, శ్రీనివాసరెడ్డి, మదన్, పుల్లయ్య, మల్లేష్, బాలమదిరాజు తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల మోహన్ రావు, వాసవీ క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుప్త, వెంకటరమణ, కోశాధికారి సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఆదివారం వీధి వ్యాపారస్తులకు గొడుగులు పంపిణీ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సమాజాభివృద్ధే ధ్యేయంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, జిల్లా గవర్నర్ జయంత్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



వీధి వ్యాపారస్తులకు గొడుగులు అందజేస్తున్న వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్

మహానందిలో భక్తుల సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన అన్నమయ్య జిల్లా డీపీఓ పార్వతి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,తమిళనాడు,మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా రుద్ర,బ్రహ్మ, విష్ణు గుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. మహానందీశ్వరుడి దంపతులకు రాత్రి ఏకాంతసేవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరుడిని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి పార్వతి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. క్షేత్రానికి వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠ రాజు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.



మహానందిలోని వృక్ష గణపతిని దర్శించుకుంటున్న భక్తులు

హైదరాబాద్ నుంచి మహానందికి పాదయాత్ర

మహానంది: కోరిన కోరిక నెరవేరడంతో హైదరాబాద్ నుంచి మహానందికి పాదయాత్రగా వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు ఆ కుటుంబ సభ్యులు. వినుకొండ పట్టణానికి చెందిన శ్రవణ్ కుమార్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. తన చెల్లిలికి వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం లేకపోవడంతో మహానంది ఆలయానికి చేరుకొని పూజలు చేపట్టగా ఆమెకు సంతానం కలిగింది. కోరిక నెరవేరడంతో చెల్లెలు శాంతి, బావ లక్ష్మిశ్రీనివాస్ మహానంది ఆలయానికి చేరుకొని కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి అమ్మవార్ల అనుగ్రహం వల్ల తమ కోరిక నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన శ్రవణ్‌కుమార్, కుటుంబ సభ్యులు

తరలిపోతున్న వృక్ష సంపద

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాలు,నల్లమల అటవీ సమీప ప్రాంతాల నుంచి కొందరు దుండగులు పెద్ద పెద్ద వృక్షాలను కూల్చి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం ట్రాక్టర్లలో భారీ వృక్షాల మొద్దులను తరలించుకెళ్తున్నప్పటికీ రెవెన్యూ,అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారుల పక్కన,వాగులు, వంకల గట్టపై, ప్రభుత్వ భూముల్లో ఉన్న భారీ వృక్షాలను కూల్చి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అలాగే చెట్లను ఇష్టానుసారంగా కూల్చడం వల్ల పృదనం కనుమరుగై వాతావరణ సమతుల్యతకు భంగం వాటిల్లే ప్రమాదముందని పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అనుమతులు లేకుండా చెట్లను కూల్చేవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నర్సాపురం సమీపంలో భారీ చెట్టును నరికి ట్రాక్టరులో తరలిస్తున్న దృశ్యం

పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే కోట్ల



కొండపేటలో పర్యటిస్తున్న కోట్ల ప్రకాష్‌రెడ్డి

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటలో ఆదివారం ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి పర్యటించారు. 11,12,13వ వార్డుల్లో ఆయన పర్యటిస్తూ ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీ ప్రజలు సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, వీధిలైట్ల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం చిగురమానుపేటలోని దర్గాలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, టీడీపీ నాయకులు కొట్రికె ఫణిరాజ్, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడ్, విజయ్‌భట్టు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కేషన్నగౌడ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహుడు(33) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన నరసింహుడు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు అతివేగంతో ఢీ కొట్టింది. ప్రమాదంలో నరసింహుడుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

మహానంది: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొల్లవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న నరసింహ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని, నొప్పిని తాళలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల సంబంధించి విద్యుత్ సరఫరా వేలలు వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్. లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

బోధనేతర పనుల భారం తగ్గించాలి


ప్యాపిలి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల విద్యాబోధనకు ఆటంకం కలిగిస్తున్న బోధనేతర పనుల భారాన్ని ప్రభుత్వం తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్‌నాయక్ కోరారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎస్టీయూ ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీఓ 117 ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు గుదిబండలా మారిన యాప్‌లు, ఆన్‌లైన్ పనుల భారం తగ్గించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ చిన్నపరెడ్డి, ఎస్టీయూ నాయకులు హాజీ మస్తాన్ వలి, చంద్రమౌళి, కిరణ్‌కుమార్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనాయక్

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

బేతంచెర్ల: యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలి సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ దుకాణ సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా రెస్టారెంట్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా హుసేన్, గూని నాగరాజు, చందురెడ్డి, హరిప్రసాద్, దస్తగిరి తదిరులుపాల్గొన్నారు.



దుర్గా రెస్టారెంట్ ను ప్రారంభిస్తున్న చలం రెడ్డి

చిరుత సంచారంపై భయం భయం

మహానంది: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోకి చిరుత రావడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అటవీ శాఖ డీఆర్ఓ హైమావతి, ఎఫ్‌డీఓ ప్రతాప్, సిబ్బంది ఆదివారం ఘటన స్థలానికి చేరుకొని చిరుత పాదముద్రలను సేకరించారు. వారు మాట్లాడుతూ అటవీ సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత జాడ, కదలికలు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు.



బెలుం గుహల ఆవరణలో బుద్ధ విగ్రహం వద్ద ఆకర్షిస్తున్న చెట్లు



గుహలకు వెళ్లే దారిలో పచ్చని స్వాగతం

ఎటు చూసినా పచ్చదనం!

కొలిమిగుండ్ల/ బేతంచెర్ల: జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. విస్తారంగా వర్షాలు కురువడంతో ఎండిపోయిన చెట్లు మెరస్తున్నాయి. ఎటుచూసినా భూమి పచ్చగా మారిపోయింది. కొండలు సైతం పచ్చగామారి కనువిందు చేస్తున్నాయి. మండల కేంద్రం కొలిమిగుండ్ల–బెలుం ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్లు వర్షాలకు కళకళలాడుతున్నాయి. బెలుం గుహల ఆవరణలోని వందలాది చెట్లు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. కొన్నాళ్లుగా వాడుపట్టిన చెట్లు పచ్చగామారి స్వాగతం పలుకుతున్నాయి. ఎత్తైన బుద్ధ విగ్రహానికి ఇరువైపులా ఉన్న చెట్లు యాత్రికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రహదారుల వెంట, గ్రామాల్లో రకరకాల పూల చెట్లు కనువిందుచేస్తున్నాయి. అదేవిధంగా బేతంచెర్ల – కర్నూలు రహదారిలో పచ్చదనం ఉట్టిపడుతుంది. గోరుమానుకొండ, సీతారామాపురం మెట్ట వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న అడవి ప్రాంతం పచ్చగా దర్శనమిస్తుంది. ఆడవుల పచ్చదనం, చల్లటి గాలిని ఆస్వాదిస్తున్నారు ప్రకృతి ప్రేమికులు.



రహదారికి ఇరువైపులా పచ్చదనం దృశ్యం



పచ్చదనాన్ని సంతరించుకున్న అడవి